# హంసలను వేటాడొద్దు [10]

మూలం: బోరిస్ వాసిల్యేవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [10]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యెవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: జూన్ 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=2772

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# హంసలను వేటాడొద్దు [10]

దీని ముందు భాగం

**జరిగిన కథ:** లిండన్ చెట్ల బెరడు ప్రభుత్వం కొంటుందని ప్రకటన వెలువడగానే ఊరి వాళ్లంతా లిండన్ చెట్లపై పడతారు. ఫ్యొడార్ ఇపటోవిచ్ అయితే గుర్రపు బళ్లపై వెళ్లి మరీ చెట్ల బెరడు వలిచేస్తాడు. యెగార్ మాత్రం ఇంకా లెక్కలు వేసుకోవటంలోనే ఉంటాడు. చివరకు నిర్ణయానికి వచ్చి కొడుకు కోల్కాని తీసుకుని అడవికి వెళ్తాడు. అప్పటికే అడవిలో లిండన్ చెట్లన్నీ బెరళ్లు ఊడిపోయి పూలు నేల రాలి ఉంటాయి. ఆ దృశ్యం అతణ్ణి కలిచి వేస్తుంది. ఇదిలా జరుగుతుంటే, యెగార్ భార్య హారిటీనా శిశుసంరక్షణ కేంద్రంలో ఉద్యోగం కోసం ప్రభుత్వాధికారుల చుట్టూ తిరుగుతుంది. **ఇక చదవండి**:——

## 10

బెరడుతో లాభాలు సంపాదించి విధిని మోసగించాలనుకున్నదే యెగార్ ఆఖరి ప్రయత్నం, నిరసన. అది అతడి ఆఖరి ప్రయత్నం కావటం వల్లనేమి, అతడిలో నిరసనకి ఏమీ మిగలకపోవటం వల్లనో, ఆ వైఫల్యం అంత కొట్టొచ్చినట్టు ఉండటం వల్లనో యెగార్ అన్ని ప్రయత్నాలకు చరమగీతం పాడాడు. అతడు తన అదృష్టంలో, తన శ్రమలో, తన శక్తి, సామర్థ్యాల్లో పూర్తిగా నమ్మకం కోల్పోయాడు. తనకోసం, కుటుంబం కోసం వెలుగు కోరుకోవటం మానేశాడు – తనని తాను మసి చేసేసుకున్నాడు. అతడు క్రమం తప్పకుండా పనికి వెళ్లసాగాడు, తవ్వమన్నచోట తవ్వేవాడు, పాతి పెట్టమన్నది పాతి పెట్టేవాడు. అయితే, ఇప్పుడు ప్రతిదీ అన్యమనస్కంగా, సగం వేగంతో చేస్తున్నాడు. ఎటువంటి ఆదేశాలు రాకుండా ఉండటానికి ప్రయత్నించేవాడు. పై అధికారులకు సాధ్యమైనంత దూరంగా కూర్చునే వాడు. చుట్ట కాలుస్తూ, సూర్యుడికేసి కళ్లు చిట్లించి చూస్తూ, దేనిగురించీ ఆలోచించకుండా నిర్వికారంగా ఉండేవాడు. ఆలోచనలంటే భయపడి వాటిని దూరంగా ఉంచటానికి ప్రయత్నించేవాడు. అయితే, అవి ఎలాగో చొరబడేవి.

కానీ ఆలోచనలు ఎలాగో చొరబడేవి. చిన్న చిన్న ఆలోచనలు; జిగటగా, నల్లగా జలగల్లాంటి ఆలోచనలు. అవి యెగార్ రక్తాన్ని పీల్చేవి. ఒకదానిని తీసెయ్యగానే రెండవది వచ్చేది, దానిని తీసేస్తే మూడోది రక్తం పిల్చటం మొదలుపెట్టేది. వాటిని తీసేస్తూండటంతోనే యెగార్‌కి

సరిపోయేది. దాంతో అతడి హృదయానికి శాంతి లేకుండా పోయింది. శాంతి స్థానంలో – అతడికి తెలియకుండా, అతడి నియంత్రణ లేకుండా – ఆందోళన కలిగిస్తోందనిపించేదేదో చోటుచేసుకుంటూ ఉండేది. దానిని యెగార్ ఒక్క మాటలో నిర్వచించాడు: ఎందుకు? ఈ ఎందుకులు చాలా ఉన్నాయి, వాటిల్లో ఏ ఒక్కదానికీ యెగార్‌వద్ద సమాధానం లేదు. కానీ అతడికి సమాధానం కావాలి, అతడి అంతరాత్మ సమాధానం కోరుతోంది, ఆ జలగలు అతడినుంచి సమాధానాన్ని పీలుస్తున్నాయి. దీనంతటినీ ఇసుమంతైనా మరిచిపోటానికి, అతడి హృదయంలోని గందరగోళాన్ని కొంతైనా ముంచెయ్యటానికి యెగార్ తాగటం మొదలుపెట్టాడు. భార్య కోప్పడకుండా ఉండటానికి నిశ్శబ్దంగా తాగేవాడు, అతడి దగ్గర డబ్బులు లేవు కాబట్టి చాలా కొంచమే తాగేవాడు. అయితే, ఇంతకు ముందు పిచ్చుక మాదిరి ప్రతి కొపెక్కు ఇంటికి తెచ్చేవాడు, కానీ ఇప్పుడు వీలు చిక్కినప్పుడల్లా ఇంటినుంచి ఒకటి–రెండు రూబుళ్లు కాజెయ్యసాగాడు. వాటితో మిత్రులతో కలిసి తాగేవాడు.

తాగటానికి మిత్రులు వెంటనే ఏర్పడ్డారు: క్రోక్, ఫిల్. క్రోక్‌ది మోకాలు మాదిరి పూర్తిగా బట్టతల, ముక్కు వంకాయ మాదిరి ఉంటుంది, కళ్లు రేగుపళ్ల మాదిరి చింతనిప్పుల్లా ఉంటాయి. వీటికి తోడు అతడి నోటిలోంచి తిట్ల ప్రవాహం వచ్చేది, అదే నోట్లోకి ఓడ్కా ప్రవాహంలా వెళ్లేది. అన్నవాహికలోంచి వెళ్లినట్టుగా కాకుండా పెట్రోలు ట్యాంకులోకి – అడుగూ, మూతలేని ట్యాంకులోకి వెళ్లినట్టు క్రోక్ పొట్టలోకి అది వెళ్లేది.

ఫిల్ అలా కాదు. ఫిల్ గ్లాసుని తిప్పుతూ, వేలెత్తి చూపుతూ ఉంటాడు, “అలవాటు తప్పకుండా ఉండటానికి తాగుతామే కానీ మత్తులో మునగటానికి కాదు.”

ఫిల్‌కి తాగుతూ మాట్లాడటమంటే ఇష్టం, ఇది క్రోక్‌కి ఎప్పుడూ చీకాకు కలిగించేది: అతడు తన ట్యాంకును నింపాలన్న నిరంతర ఆందోళనలో ఉండేవాడు. కానీ, ఫిల్ ఫలితానికి కాక ఆ ప్రక్రియకు విలువనిచ్చేవాడు. ఎవరూ తన కాళ్ల మీదపడి తొక్కకుండా ఉండటానికి అందరికంటే ఆఖరున అతడు తాగటం పూర్తి చేసేవాడు. సీసాలో మిగిలింది గ్లాసుల్లో పోసేవాడు, ఆఖరి చుక్క గ్లాసులో పడేవరకు సీసాని ఊపేవాడు. ఆ తరువాత తత్వంలోకి దిగేవాడు, “దీంట్లో, ఈ ద్రవంలో ఏముంది? ఈ ద్రవంలో ఏడుగురు అమ్మాయిలు మునిగి ఉన్నారు: దుఖమూ, సంతోషం;

వృద్ధాప్యం, యవ్వనం; ప్రేమ, సలహా; పద్దెనిమిది సంవత్సరాలు. మిమ్మల్ని తాగేటప్పుడు నేను చేసేది ప్రతిదీ గుర్తుంచుకోండి.”

యెగార్ ఇందుకు భిన్నంగా నిశ్శబ్దంగా తాగేవాడు. ఆత్రంగా, గుటకలు వేస్తూ తాగేవాడు: జలగలను వదిలించుకోవాలన్న తొందరలో అతడుండేవాడు. ఇంకో మాటల్లో చెప్పాలంటే అతడు గుర్తంచుకోటానికి కాకుండా, మరిచిపోటానికి తాగేవాడు. ప్రతి వ్యక్తీ తన గాయాలను మాన్పుకోటానికి ప్రయత్నిస్తుంటాడు.

అది ఉపయోగపడేది, కానీ ఎంతోసేపు కాదు. దానిని కొనసాగించటానికి డబ్బు కావాలి. చిల్లర, మల్లర పనులు చేయటం ద్వారా కొంత డబ్బు సంపాదించటం నేర్చుకున్నాడు: దీంట్లో క్రోక్ చాలా నిపుణుడు. ఏదైనా లారీ నుంచి సరుకు దించటం, లేదా ఒక ముసలావిడ కంచె బాగు చెయ్యటం, లేదా అలాంటిదో మరొకటి పని దొరకబుచ్చుకునేవాడు. మామూలుగా ఉన్నప్పుడు అతడి బుర్ర పాదరసం లాగా పనిచేసేది. కానీ యెగార్‌కి కోపం వచ్చేది.

“నీకున్న నైపుణ్యాలకు ఈ చిల్లర, మల్లర పనులు కాకుండా చక్కగా పనిచేస్తూ ఉండిఉండాలి.”

“పని ఎక్కడికీ పోదు: కొద్దిగా గొంతు తడుపుకుని దానిని పూర్తి చేద్దాం. ఒకవేళ పూర్తి చెయ్యలేకపోతే, అది...”

దానివల్ల ఏమవుతుందో చెప్పేవాడు. ఫిల్ దాని సారాంశమంతటినీ ఒక్క ముక్కలో తేల్చేసేవాడు: “యంత్రాలు పనిచెయ్యాలి, మనుషులు మానసికంగా సేదదీరాలి.”

అయితే, ఒక్కొక్కసారి క్రోక్ కూడా ఎటువంటి పని సంపాదించలేకపోయేవాడు. అప్పుడు ఒకళ్లనొకళ్లు తిట్టుకుంటూ, కొట్టుకుంటూ బాధపడేవాళ్లు. జలగలు పెట్టే బాధ భరించలేక యెగార్ పార కింద పడేసి ఇంటికి పరిగెత్తేవాడు. హారిటీనా ఇప్పుడు కఫెటేరియాలో గిన్నెలు కడిగే పని చేస్తుండటం వల్ల ఆ పనిలో అతడిని పట్టుకోకపోవటం అతడి అదృష్టమే. యెగార్ దేవుని పటం ముందునుంచి ఒక రూబులు, ఒక్కొక్కసారి రెండు రూబుళ్లు కాజేసి, తిరిగి తన మిత్రులు, సహచరులవద్దకు పరిగెత్తుకుని వెళ్లేవాడు.

“దీంట్లో, ఈ ద్రవంలో ఏముంది?”

కన్నీళ్లు – దాంట్లో ఉన్నదవే. ఇంటిపని, పిల్లలు, ఇప్పుడు పనితో హోరిటీనా ఎంత తీరిక లేకుండా ఉన్నా, ఆమెకు రూబుళ్ల లెక్క ఉంది. అవి ఎలా మాయమౌతున్నాయో ఆమెకు పాలుపోలేదు. ఒకసారి ఆవేశంలో కోల్కాని తిట్టసాగింది: "సిగ్గులేని వెధవ, దొంగనాయాలా!"

అంతటితో ఊరుకోకుండా అతడి మీదపడి కొట్టసాగింది. జుట్టు, చెవులు పట్టుకుని ఎక్కడ దొరికితే అక్కడ కొట్టసాగింది. కొడుతూ ఆమె అరుస్తోంది, ఆమె అరుపులకు ఓల్యా ఏడ్పు లంకించుకుంది. ఇంకోవైపు కోల్కా బాధతో అరుస్తున్నాడు. యెగార్ నోరు మూసుకుని ఉండేవాడే, కానీ అతడి కొడుకు దిగ్భ్రమకి లోనై చూస్తున్నాడు. ఆ చూపు అతడి అంతరాత్మని తొలిచేసింది.

"ఆ డబ్బులు నేను తీసాను, టీనా."

ఆ మాటలు అతడి నోటినుంచి వచ్చాయో లేదో భయం అతడిని కమ్ముకుంది. ఆ భయం అతడిని మొద్దుపరిచింది: ఇప్పుడేం చెప్పాలి? ఏ అబద్ధం సృష్టించాలి?

"దేనికి తీసావు?"

ఆ ప్రశ్నను ఆమె వెంటనే వెయ్యకపోవటం ఒకింత అదృష్టమనే చెప్పాలి. దాంతో యెగార్‌కి ఆలోచించటానికి సమయం దొరికింది, ఆమె చేతుల్లోంచి తప్పించుకోటానికి కోల్కాకి వీలు చిక్కింది. కోల్కా ముక్కు తుడుచుకున్నాడు కానీ అక్కడినుంచి పారిపోలేదు. వాళ్ల నాన్నవంక తేరిపార చూడసాగాడు.

"నేను, అహ్, అది... తెలిసిన వ్యక్తికి అప్పిచ్చాను. అతడికి చాలా అవసరంగా ఉండింది."

"అతడికి అవసరమూ, మనకి అవసరం లేదా? ఇప్పుడు తిండిగింజలు ఏం పెట్టి కొనాలి? ఎలా బతకాలి, ఏమీ చేతకాని అసమర్ధుడా. సమాధానం ఉందా? ఈ క్షణం టోపీ పెట్టుకుని వెళ్లి అతడికి ఇచ్చిన డబ్బు తిరిగి తీసుకునిరా!"

స్త్రీకి ఉద్యోగం ఇస్తే, నువ్వు గ్రహించేలోపు ఆమె ఇంటిలో నీమీద పెత్తనం చెలాయిస్తుంది. అది వాస్తవం.

"వెంటనే వెళ్లు!"

యెగార్ టోపీ పెట్టుకుని గేటుగుండా బయటకు వెళ్లాడు. కానీ ఎక్కడికి వెళతాడు? మోకాళ్లమీద దేకుతూ తోడల్లుడు ఫ్యోడార్ ఇపటొవిచ్ దగ్గరకా? అతడు డబ్బులు ఇవ్వవచ్చు, కానీ దానికంటే ముందు అతడిని చిత్రవధ చేస్తాడు. వదలకుండా సాధిస్తాడు. అదంతా భరించాలా?

అతడు డబ్బులు ఇవ్వకపోగా అసలు విషయం హారిటీనాకి చెప్పేస్తే? అయితే మరెక్కడికి వెళ్లాలి? ఎక్కడికీ వెళ్లటానికి లేదు.

ఈ విధంగా ఆలోచిస్తూ యెగార్ ఊరిలో సందులూ, గొందులూ తిరిగి మళ్లీ ఇంటికి చేరుకున్నాడు. టోపీ తీసేస్తూ, తలుపు దగ్గరనుంచే ఎలాగో చెప్పాడు, “అతడు లేడు. ఈ ప్రాంతంలోనే లేకుండా మాయమైపోయాడు.”

హారిటీనా బలంగా ఊపిరి తీసుకుని ఛాతీని పొంగించింది – అచ్చం ఫిల్ తన గ్లాసు అడుగున వెతికే అందమైన పద్దెనిమిదేళ్ల అమ్మాయి మాదిరి. ఆ తరువాత మొదలుపెట్టింది:

“నా జీవితానికి శాపమైన నా బతుకుకి భారమైన ఎందుకూ పనికిరాని అసమర్థుడైన నీ మీద దేవుడైనా జాలి...”

యెగార్ తల వేలాడేసుకుని అదంతా వింటున్నాడు, కొడుకు వైపు పక్క చూపులు చూస్తున్నాడు. కానీ కోల్కా తండ్రి వంకా, తల్లి వంకా కాకుండా తన దిక్సూచిని చూస్తూ ఉన్నాడు. ఆ దిక్సూచి వంక చూస్తున్న అతడికి ఏమీ వినపడటం లేదు. ఆ వెలకట్టలేని దిక్సూచిని మరునాడు ఊరికే ఇచ్చెయ్యాల్సి వస్తోంది మరి.

అదంతా ఓల్యా వల్ల జరిగింది. తన చెల్లెలు ఓల్యా కాదు, ఓల్యా కుజినా, పిలక జడలతో కనురెప్పలు అల్లలాడించే పిల్ల. ఓవా తరుచు ఆమె జడను లాగేవాడు, ఆమేమో నవ్వేది. ఒక్కొక్కసారి అతడిని చిన్న దెబ్బవేసి తరువాత ముత్యాల్లాంటి పళ్లను బయటపెట్టి నవ్వేది. ఆమె నవ్వంటే కోల్కాకి ఎంతో ఇష్టం, కానీ ఆమె జడ లాగటానికి కలలో కూడా సాహసించలేదు. ఆమెను దూరం నుంచి చూసేవాడంతే. ఆమె అతడి వైపు చూస్తే చప్పున తన చూపును మరల్చుకునేవాడు.

ఇప్పుడు శలవలు కావటంతో వాళ్లిద్దరూ తారసపడటం చాలా అరుదైపోయింది. అయితే, అప్పుడప్పుడు నది దగ్గర కలిసే వాళ్లు. ఆమె మిగిలిన ఆడపిల్లలతో కలిసి పొదల వెనక స్నానం చేసేది కానీ, అక్కడినుంచి కూడా ఆమె నవ్వు కోల్కా చెవులను తాకేది. అప్పుడు కోల్కాకి ఏదో ఒక సాహస కార్యం చెయ్యాలని ఎంతగానో అనిపించేది: నది ఆవలివైపు వరకు ఈదటమో, లేదా గండుమీనుని తోకతో పట్టుకోవటమో, లేదా చావునుంచి ఎవరినైనా (అది ఓల్యానే అయితే ఇంకా బాగుంటుంది) కాపాడటమో వంటివి చెయ్యాలనిపించేది. కానీ ఆ నది చాలా పెద్దది, అందులో

గండుమీనులేవీ లేవు, ఎప్పుడూ ఎవ్వరూ మునిగిపోయే ప్రమాదం ఏర్పడలేదు. అందుకే అతడు నదిలోకి దూకటంలో తన ప్రతిభను ప్రదర్శిస్తుండేవాడు, కానీ ఆమె పట్టించుకునేది కాదు.

నిన్నఓవా, అతడు ఈతకొట్టటానికి ఒక కొత్త ప్రదేశానికి బయలుదేరారు, ఓల్యా కుజినా కూడా వాళ్ల వెంటపడి రాసాగింది. నది ఒడ్డుకి చేరుకోగానే ముందుగా ఓల్యా తన పై గౌను తీసేసి నీటిలోకి దిగింది. ఓవా వెంటనే ఆమెను అనుసరించాడు. కోల్కా ప్యాంటు విప్పే క్రమంలో అతడి కాలు దాంట్లో చిక్కుకుపోయి గడ్డిలో పడిపోయాడు. దాంట్లోంచి అతడు బయటపడేసరికి వాళ్లిద్దరూ నీటిలో ఉన్నారు. అతడు కూడా వాళ్లను అనుసరిద్దామని అనుకున్నాడు కానీ ఒకసారి అటు చూసిన తరువాత తన మనసు మార్చుకున్నాడు. కొంత దూరం నడిచి వెళ్లి ఇసకలో కూర్చున్నాడు. ఉన్నట్టుండి అతడికి చాలా నీరసంగా, ఎంతో నిరుత్సాహంగా అనిపించసాగింది. నీళ్లు, సూర్యకాంతి తమ ఆకర్షణను కోల్పోయినట్లున్నాయి. ఆకురాలే కాలం మాదిరి లోకం మబ్బులు కమ్ముకున్నట్టయ్యింది. ఓల్యా కుజినాకి ఓవా ఈత కొట్టటం నేర్పిస్తున్నాడు. ఈత ఎలా కొట్టాలో చూపిస్తూ, వివరిస్తూ అతడు అరుస్తున్నాడు.

“ఏయ్ మొద్దూ! కాళ్లు, చేతులన్నీ ఒక్కసారే ఆడిస్తే ఎలా? ఇదిగో, నీళ్లల్లో నువ్వు పైకి తేలేలా పట్టుకుంటాను. అదీ.”

నిజమైన మొద్దులాగా ఓల్యా అతడు చెప్పింది వింటోంది. ఓవా కంటే కోల్కా చాలా మెరుగైన ఈతగాడని, అతడికి లోతన్నా భయం లేదని ఆమెకు తెలుసు. అయినా సరే ఓవాతో ఈతకొట్టటం నేర్చుకుంటోంది, అది చాలదన్నట్టు నవ్వుతోంది.

దాంతో కోల్కా నదిలోకి దిగలేదు. ఆమె నవ్వులు, ఓవా కఠిన ఆదేశాలు వింటూ ఓల్యా మనసు మార్చుకుని తనని రమ్మంటే తాను ఎలా నేర్పుతాడో ఊహించుకోసాగాడు. కానీ ఓల్యా మనసు మార్చుకోలేదు: బాగా చలి పుట్టేవరకు నీటిలో కాలక్షేపం చేసి, ఆ తరువాత నీటిలోంచి బయటకు వచ్చింది. అన పైగౌను తీసుకుని, చడ్డీని పిండేసుకోటానికి పొదలలోకి పరిగెత్తింది. ఓవా వచ్చి అతడి పక్కన వెల్లికిలా పడుకుని, కళ్లింతలు చేసుకుని చూస్తున్నాడు.

“నేను ఓల్యా బాయిలు పట్టుకున్నాను!”

కోల్కాకి తన ఒంట్లో ఎంత రక్తం ఉందో తెలియదు, కానీ ఆ క్షణాన అదంతా అతడి ముఖంలోకి చేరింది. ఉన్న కాస్త పొట్టా లుంగచుట్టుకుపోయినట్టయ్యింది.

"ఆమెకింకా అవి లేనే లేవు..."

"అయితే ఏమిటంట? అవి ఏర్పడే చోట పట్టుకున్నాను!"

మంచు కురవాలని, ఉన్నట్టుండి ఉరుములు, మెరుపులు రావాలని, తుఫాను కమ్ముకోవాలని కోల్కా దేవుడిని ప్రార్థించాడు. వీటిల్లో ఏదీ జరగలేదు కానీ అది ఉపయోగపడింది. ఆ తరువాత ఓవా ఎంత ఒత్తిడి చేసినా ఓల్యా మళ్లీ నదిలోకి దిగటానికి తిరస్కరించింది.

"రాను. ఆలస్యమైతే మా అమ్మ ఊరుకోదు."

ఎవరికైనా ఎంత సంతోషం కావాలి? ఆమె "రాను," అనటంతోనే కోల్కా అంతా మరిచిపోయాడు: వాళ్ల ఈత, ఆమె నవ్వు, ఓవా పిచ్చి మాటలు. ఓవా అబద్ధం చెప్పాడు – అతడు అబద్ధం చెప్పాడనటంలో ఏమాత్రం అనుమానం లేదు! నది వెంట తిరిగి వెళుతుండగా ఇప్పుడు కోల్కా మౌనంగా లేడు, అతడు ఉష్ణదేశాల గురించి మాట్లాడుతున్నాడు. తాను ఎన్నడూ చూడని సముద్రాల గురించి, ఏనుగుల గురించి చెబుతున్నాడు. కానీ అతడు అక్కడికి వెళ్లినట్టే, వాటినన్నింటిని చూసినట్టే చెపుతున్నాడు, ఓల్యా కళ్లేమో ఆశ్చర్యంతో పెద్దవవుతున్నాయి.

ఈలోగా కోపంతో ఉన్న ఓవా వాళ్ల వెనగ్గా నడుస్తున్నాడు. అయితే, అతడిది ఒకరి వెనక నడిచే తత్వం కాదు, అందుకే వెనకగా కొంచెం అవతలి పక్కగా పొదలలో అతడు నడుస్తున్నాడు. వాటిని కావాలని తొక్కుతూ, కావాలని చప్పుడు చేస్తున్నాడు.

"ఆ ఏనుగులు ఎంత తెలివైనవో తెలుసా? వాటికి అంతా అర్థమవుతుంది! ఒక్క ఈల వేస్తే చాలు మనుషుల్లాగా పనిలోకి వస్తాయి. భోజనానికైనా అంతే."

"నిజంగా?" వాళ్ల అమ్మ ప్రకటించినట్టే ఓల్యా కూడా తన ఆశ్చర్యాన్ని ప్రకటించింది: "వాళ్లు ఏనుగులను తింటారా?"

కోల్కా నిట్టూర్చాడు: ఆసక్తిగొలిపే విషయాలను నువ్వు అడగటం లేదు.

అతడు ఒక క్షణంపాటు ఆలోచించాడు.

"ఏనుగు మాంసం చాలా ఖరీదు."

"ఎవరైనా నాకు ఏనుగు మాంసం తినిపిస్తే! వాళ్లు ఏం చెయ్యమంటే అది చేస్తాను, ఏదైనా!"

అంతటి అద్భుత బహుమానం ఉన్నప్పటికీ ఆమె కోసం కోల్కా ఏనుగుని చంపను కాక చంపడు. ఈ భూమి మీద ఏనుగులు ఉంది వాటిని అమ్మాయిలు తినటానికి కాదు – వాళ్లే

అందమైన అమ్మాయిలైనా సరే. అతడి ఆలోచనలు అలా ఉన్నాయి. కానీ పైకి మాత్రం ఆమెను ఇబ్బంది పెట్టకుండా, “ఏనుగులు ఇక్కడ దొరకటం కష్టం, వాటికోసం ఎంత ఖర్చుపెట్టినా సరే.” “నాకొక ఏనుగు దొరికింది!” ఉన్నట్టుండి ఓవా అరిచాడు. “స్థానిక ఏనుగు!” అలా అరుస్తూ, చేతులో ఒక కుక్కపిల్లతో అతడు పొదలలోంచి బయటకు వచ్చాడు. అది ఎవరో వదిలిపెట్టిన బక్కచిక్కిన కుక్కపిల్ల, ఒక చెవికి గాయమై ఉంది. దాని కళ్ల నుంచి — అవి కన్నీళ్లో, ఒట్టి నీళ్లో — కారుతూ ఉన్నాయి. అది దాని బుజ్జి నాలుకతో ఓవాని నాకటానికి ప్రయత్నిస్తోంది. “యాక్! చీదరేస్తోంది!” అని అరుస్తూ కోల్కా వెనక దాక్కుంది ఓల్యా కుజినా. “అయ్యో, దానికంతా రోగం.” “దానిని ముంచేద్దాం,” నవ్వుతూ అన్నాడు ఓవా. “దీనికి గజ్జి ఉన్నట్టుంది.” “దానిని ఎలా ముంచేస్తావు?” కోల్కా వెనకనుంచి మెరుస్తున్న కళ్లతో తొంగి చూడసాగింది ఓల్యా. “నీళ్లల్లోకి విసిరేస్తావా?” “అలా చేస్తే అది ఈదుకుంటూ వెళ్లిపోవచ్చు. కాసేపు దీనిని పట్టుకో; ఒక రాయి పట్టుకొస్తాను.” అలాగంటూ అతడు కుక్కపిల్లను కోల్కా వైపుకితోశాడు. కానీ, కోల్కా వెనక్కి తగ్గి తన చేతులను దాచేసుకున్నాడు. అతడు ఏదో చెప్పచానికి కూడా ప్రయత్నించాడు కానీ ఉన్నట్టుండి అతడి మాటలు మాయమైపోయాయి. అంతసేపు ఓవా కుక్కపిల్లను సంకలో పెట్టుకుని నది ఒడ్డున రాయి కోసం వెదకసాగాడు. ఇటు కోల్కా తన మాటల కోసం వెదుకుతున్నాడు — చాలా ముఖ్యమైన మాటలు, మండుతున్న మాటలు. కానీ అవి అతడికి దొరకటం లేదు. ఓవా కూడా ఎంత వెతికినా అతడికి రాయి దొరకలేదు. అందుకు కోల్కా సంతోషించేలోపల ఓవా ఒక్క కేక పెట్టాడు: “నాకు రాయితో పనిలేదు! నదిలోకి వెళ్లి నీళ్లల్లో ముంచి పట్టుకుంటే ఊపిరాడక క్షణంలో చచ్చిపోతుంది!” అలాగంటూ అతడు నీటివైపుకి పరిగెత్తాడు. కోల్కా గొంతు ఇంకా పెగలటం లేదు, మాటలు రావటం లేదు. పరిగెత్తుకుంటూ నీటి అంచున ఓవాని చేరుకుని అతడి చొక్కా పట్టుకున్నాడు. “నన్నొదులు!” అంటూ ఒక్క విదిలింపుతో ఓవా అతడి చేతినుంచి తప్పించుకున్నాడు. “నాకు ఇది దొరికింది, నేను దీని యజమానిని! ఇప్పుడు దీనితో నా ఇష్టం వచ్చినట్టు చేస్తా.” “అతడికి అది దొరికింది, అతడు దాని యజమాని,” ఓల్యా కుజినా వంతపాడింది. “ఇప్పుడు దానిని అతడిష్టం వచ్చినట్టు చెయ్యవచ్చు. దానిని నీళ్లల్లో ముంచనివ్వు: సరదాగా ఉంటుంది.”

“జెరాసిం, ముము[1] లాగా,” ఓవా అంటూ మళ్లీ నీటిలోకి సాగాడు. “దానిని నాకివ్వు,” కోల్కా నిదానంగా అడిగాడు. “దానిని నాకివ్వు, ఏం? దానికి బదులుగా నీకేం కావాలంటే

అదిస్తాను. ఏం కావాలంటే అది.” “నీ దగ్గర ఏముంది?” ఓవా ఆగాడు కానీ, అతడిని పరిహసిస్తూ అడిగాడు. “మీ దగ్గర అప్పులు తప్పించి ఇంకేమీ లేవు: మా నాన్న చెప్పాడు.” “అప్పులు తప్పించి!” ఓల్యా కుజినా నవ్వింది (ఆ నవ్వు– గొంతులో ఏవో మువ్వలున్నట్టు). “వాళ్ల దగ్గర ఏమీ లేదు – ఏమీలేదు: చివరికి పంది కూడా లేదు!” “దానిని నాకివ్వు,” అప్పుడే చల్లటి నీటిలో మునిగి బయటకు వచ్చినవాడికిమల్లే ఉన్నట్టుండి కోల్కా వణికిపోసాగాడు. “నీకు... నీకు కావాలంటే నా దిక్సూచి ఇస్తాను, సరేనా? నువ్వు దానిని అచ్చంగా ఉంచేసుకోవచ్చు, దానిని మాత్రం నీటిలో ముంచకు. పాపం.” “పాపం!” నవ్వింది ఓల్యా కుజినా. “అదంటే అతడు జాలి పడుతున్నాడు!”

---

[1] 1852లో ప్రచురితమైన ఇవాన్ టర్గెనెవ్ రాసిన ముము అన్న కథలో మూగ బానిసైన జెరాసింను ప్రపంచంతో అతడికి మిగిలిన ఆఖరి బంధమైన పెంపుడు కుక్క మునుని నీటిలో ముంచేసేలా ఒత్తిడి చేస్తారు.

*(తరువాయి భాగం వచ్చే వారం)*

For Latest Telugu Books - Visit now:
Kinige
.com